
స్వాగతం - సుస్వాగతం
శ్రీ N.Md. ఫరూక్ గారు
మైనార్టీ & న్యాయశాఖ మంత్రివర్యులు
శ్రీమతి బైరెడ్డి శబరి గారు
పార్లమెంట్ సభ్యులు, నంద్యాల.
గౌ॥ శ్రీ టి.జి.భరత్ గారు
పరిశ్రమలు & వాణిజ్య శాఖ మంత్రివర్యులు
ఆంధ్రప్రదేశ్ రోడ్లు & భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడులు శాఖ మంత్రివర్యులుగా
ప్రమాణస్వీకారం చేసి మొదటి సారిగా నంద్యాల జిల్లాకు విచ్చేయుచున్న
గౌ.శ్రీ.బి.సి.జనార్ధన్‌రెడ్డి గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు
శ్రీ B.C.జనార్ధన్‌రెడ్డి గారు, శ్రీమతి B.C. ఇందిరమ్మ గారు
రోడ్లు & భవనాల శాఖ మంత్రివర్యులు, బనగానపల్లె.
శ్రీ ధర్మవరం సుబ్బారెడ్డి గారు
తెలుగుదేశం పార్టీ
రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, డోన్.
శ్రీ ఎం.మురళీకృష్ణ గౌడ్ గారు
మార్కెట్‌యార్డ్ మాజీ ఛైర్మన్, డోన్.
తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు - డోన్.

అభివృద్ధి పరుగులు



నంద్యాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ఇక నుంచి అభివృద్ధి పథంలో నడవనుంది. జిల్లాకు మూడు మంత్రి పదవులను సీఎం చంద్రబాబు కట్టబెట్టారు. శుక్రవారం వారికి కీలక శాఖలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడి శాఖను కేటాయించగా, నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్‌కు మైనారిటీ సంక్షేమ శాఖతో పాటు, న్యాయశాఖను కేటాయించారు. ఇక కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్‌కు పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలను అప్పజెప్పారు. దీంతో నంద్యాల, కర్నూలు జిల్లాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు అనువైన పరిస్థితులు ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే ప్రస్తుతం ముగ్గురు మంత్రుల సారథ్యంలో జిల్లా అభివృద్ధి పథాన నడుస్తుందని, జిల్లాకు మంచి రోజులు వచ్చాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



రోడ్లు బాగుపడతాయన్న ఆశ


ఉమ్మడి కర్నూలు జిల్లా రాయలసీమకు ముఖద్వారం వంటిది. పైగా ఒకప్పటి రాజధాని. కానీ ఇక్కడి రోడ్లు మాత్రం మారుమూల జిల్లాను తలపిస్తాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాష్ట్ర, జిల్లా రహదారులు దాదాపు వందకు పైగా ఉన్నాయి. ఈ ఐదేళ్ళలో ఆయా సంవత్సరాల్లో వచ్చిన తుఫాన్లకు, వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్ల గురించి పట్టించుకున్నదే లేదు. గతంలో రోడ్ల పనులు చేసిన గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవటంతో టెండర్లు పిలిచినా రాని పరిస్థితి. ఒకనొక దశలో గుత్తేదారులను బ్లాక్ లిస్టులో పెడతామని ప్రభుత్వం హెచ్చరించినా, వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించదనే ఉద్దేశంతో కనీసం స్పందించలేదు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోనికి రావటం, ఇచ్చిన హామీలను నెరవేరుస్తుండటంతో రోడ్లను కూడా బాగు చేస్తుందని జిల్లా వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పైగా జిల్లాకు చెందిన బీసీ జనార్దన్‌రెడ్డికి సంబంధిత శాఖ కేటాయించటంతో జిల్లాకు నిధులు ఎక్కువగానే వస్తాయన్న ధీమాతో కూడా ఉన్నారు.

పారిశ్రామిక పరుగులు



ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రి పదవి దక్కించుకున్న టీజీ భరత్‌కు మరో ముఖ్యమైన శాఖ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ కేటాయించారు. దీంతో ఇక ఉమ్మడి జిల్లా పారిశ్రామికంగా పరుగులు తీయనుంది. వారసత్వంగా వచ్చిన పలు వ్యాపారాలను నిర్వహిస్తున్న టీజీ భరత్‌కు పారిశ్రామిక వేత్తలతో, వాణిజ్య విభాగంలో ఎలాంటి విధానాలు అనుసరించాలనే దానిపై సంపూర్ణ అవగాహన ఉంది. ఈ అనుభవం సంబంధిత శాఖను సమర్థవంతంగా నిర్వహించటానికి ఉపయోగపడుతుందన్న భావనతో టీజీ భరత్‌కు చంద్రబాబు కీలక శాఖను కేటాయించారు. ఇక జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు పరిశ్రమలు జిల్లాకు వచ్చాయి. దీనివల్ల జిల్లాలో చాలామందికి ఉపాధి అవకాశాలు లభించాయి. ఇంకా పరిశ్రమలు రావటానికి కూడా జిల్లాలో అనువైన పరిస్థితులున్నాయి. పెట్టుబడి శాఖ పగ్గాలు చేపట్టిన బీసీ జనార్దన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రిగా టీజీ భరత్ ఇద్దరూ సమన్వయంతో పనిచేయగలిగితే జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు లోటే ఉండదు.





మైనారిటీల్లో నూతనోత్సాహం

ఉమ్మడి జిల్లాలో ముస్లింల సంఖ్య దాదాపు 8 లక్షలకు పైగానే ఉంది. వక్ఫ్ బోర్డు భూములు కూడా భారీగా ఉన్నాయి. అయితే వైసీపీ పాలనలో ఉమ్మడి జిల్లాలోని పలు వక్ఫ్‌బోర్డు భూములను ఆయా నియోజకవర్గ నేతలు చెరబట్టారు. ప్రస్తుతం మైనారిటీ శాఖను జిల్లాకు చెందిన ఫరూక్‌కు ఇవ్వడంతో వక్ఫ్‌బోర్డు భూములకు రక్షణ దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇక వైసీపీ ప్రభుత్వంలో మైనారిటీలకు ఎక్కువ పదవులు కట్టబెట్టామని చెబుతున్నా, అవన్నీ రాజకీయ లబ్ధి కోసమే చేసిందే తప్ప, పేద మైనారిటీలకు చేసిందేమీ లేదు. జిల్లాకు చెందిన నేతకే మైనారిటీ, పైగా ఫరూక్ లాంటి సీనియర్ నాయకుడికి రావటం వల్ల పేద మైనారిటీలకు మేలు జరిగే అవకాశం ఉంది.





- జిల్లా మంత్రులకు కీలక శాఖలను కేటాయించిన సీఎం చంద్రబాబు
- బీసీకి రోడ్లు, భవనాలు, పెట్టుబడులు
- టీజీ భరత్‌కు పరిశ్రమలు, వాణిజ్యం..
- ఫరూక్‌కు మైనారిటీ, న్యాయ శాఖ
- ఉమ్మడి జిల్లాలో చిగురించిన ఆశలు

ఇద్దరు మంత్రులున్నా ఐదేళ్లలో అభివృద్ధి సున్నా

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లా నుంచి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం మంత్రులుగా పనిచేశారు. అయినా ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి అనేది జాడకైనా కానరాలేదు. ముఖ్యంగా ఆర్థిక శాఖను చేపట్టిన బుగ్గన జిల్లాకు మేలు చేస్తాడని, నిధుల వరద పారిస్తాడని అందరూ భావించారు. కానీ ఆయన చేసిందేమీ లేదు. పైగా జిల్లాకు వివిధ కాంట్రాక్టు పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్ పెట్టడంతో కాంట్రాక్టర్లు కొంతమంది ఆత్మహత్య కూడా చేసుకున్న ఘటనలు జిల్లాలో ఉన్నాయి. పైగా టీడీపీ హయాంలో వచ్చిన పరిశ్రమలను తమ ఖాతాల్లో వేసుకుని క్రెడిట్ కొట్టేసేందుకు ప్రయత్నించారు. ఇక పలు కేబినేట్ మీటింగుల్లో జిల్లాకు పలు పరిశ్రమలు తీసుకువస్తున్నామంటూ ప్రగల్భాలు పలికిన గత వైసీపీ ప్రభుత్వం ఆ తర్వాత వాటి ఊసే ఎత్తలేదు. అన్ని విధాలుగా జిల్లాను వెనుకబాటుతనానికి గురిచేసింది.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

నంద్యాల క్రైం, కల్చరల్, జూన్ 14 : బక్రీద్ పండుగను ఈ నెల 17న ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్, ఎస్పీలు ముస్లిం మత పెద్దలతో, శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలు బక్రీద్ పండుగ మతసామరస్య భావనతో జరుపుకోవాలన్నారు. నంద్యాల జామియా మసీదు, నూనెపల్లె జామియా మసీదు, ప్రతి ఈద్గా దగ్గర పారిశుధ్య చర్యలు తీసుకోవాలని, నీటి సదుపాయాన్ని కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మజ, నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జేడీ మురళీకృష్ణ, శాంతికమిటీ సభ్యులు అబ్దుల్‌కలాం, అబులైజ్ అక్బర్‌బాషా, ప్రహ్లాద, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కె. శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బండిఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో

బక్రీద్ పండుగను శాంతియుతంగా ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని బండిఆత్మకూరు ఎస్సై కె.మల్లికార్జున కోరారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో శుక్రవారం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలన్నారు.

నేడు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బనగానపల్లెకు రాక



బనగానపల్లె రూరల్, జూన్ 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా బీసీ జనార్దన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారి సొంత నియోజకవర్గం బనగానపల్లెకు శుక్రవారం రానున్నారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీసీ కుటుంబ అభిమానులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం బీసీ జనార్దన్‌రెడ్డికి రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖలు కేటాయించి సీఎం చంద్రబాబునాయుడు సముచిత స్థానం కల్పించారని టీడీపీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. మంత్రిగా బీసీ జనార్దన్‌రెడ్డి తొలిసారి నియోజకవర్గంలోకి అడుగుపెడుతండటంతో దారి పొడవునా బ్యానర్లు, పసుపు తోరణాలు కట్టి పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు బనగానపల్లె మండల పరిధిలోని గోవిందిన్నె, పలుకూరు క్రాస్ రోడ్ వద్దకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేరుకోనున్నారు. అక్కడి నుంచి హుసేనాపురం, యనకండ్ల, బత్తులూరుపాడు మీదుగా 10 కిలో మీటర్ల మేర ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికేలా టీడీపీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి.

ఎల్లార్తి దర్గా ఈవోపై దాడి



చేతికి ఉన్న రక్తగాయాలు చూపుతున్న ఈవో

- హత్య చేసేందుకు యత్నం
- అడ్డుపడిన గ్రామస్తులు
- ఈవోకు రక్తగాయాలు

హొళగుంద, జూన్ 14: ఎల్లార్తి శేక్షావలి, షాషావలి సాహెబ్ దర్గాలో వక్ఫ్‌బోర్డు తరఫున ఈవోగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ రెహమాన్‌పై ఎల్లార్తికి చెందిన బోయ మల్లికార్జున, అతని అనుచరులు దాడి చేసి గాయపరిచారు. శుక్రవారం ఉదయం ఎల్లార్తి దర్గాకు జిల్లా మైనారిటీ సంక్షేమ అభివృద్ధి అధికారి సునీల్ వచ్చి, ఈనెల 21వ తేదీన విజయవాడలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ఎల్లార్తి దర్గాకు సంబంధించిన వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే దర్గాకు సంబంధించిన 10 మరుగుదొడ్లు, స్నానపు గదులకు సైతం వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దర్గా మాజీ నిర్వాహకుడు మల్లికార్జున తన స్థలంలో వాటిని నిర్మించారని, అందువల్ల అవి ప్రభుత్వానికి సంబంధించినవని, కోర్టు ద్వారా నోటీసులు పంపినట్లు తెలిపారు. వాటి తాళాలు ఇవ్వాలని అధికారులు కోరినా, ఇవ్వలేదన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో కోపోద్రిక్తుడైన మల్లికార్జున దీనికంతా ఈవో కారణమంటూ ఆయనపై అధికారులందరూ చూస్తుండగా దర్గాలోనే దాడి చేశారు. ఈ దాడిలో ఈవో అబ్దుల్ రెహ్మాన్ కుడి చేతి వేళ్లకు, కాళ్లకు గాయాలయ్యాయి. గ్రామస్తులు అడ్డుకోవడంతో తనకు ప్రాణహాని తప్పిందని, లేకపోతే హత్య చేసేవాడని ఆయన ఆవేదన చెందాడు. నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో మల్లికార్జునపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదని, అధికార పార్టీకి చెందిన వ్యక్తి అని, మంత్రి అనుచరుడని, పోలీసులు తన ఫిర్యాదును నీరుగార్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఈవో అబ్దుల్ రెహ్మాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పెద్దయ్య తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి'

పాణ్యం, జూన్ 14: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని డిప్యూటీ డీఈవో మహబూబ్‌బేగ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలోని పీఎం పోషణ్‌ను, నదుపాయాలను, రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉచిత పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పోషణ్ నిర్వాహకులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఒక్కో విద్యార్థికి బియ్యం, కందిపప్పు, ఆయిల్ ఎంత మోతాదులో వేయాలో తెలిపారు. విద్యాబోధనలో ఉపాధ్యాయులు అలసత్వం వహించరాదన్నారు. విద్యాభివృద్ధికి కృషి చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎంలు మేరీసునీత, పద్మజ, ఎండీఎం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, యూనివర్సిటీ ప్రతినిధులు

నందికొట్కూరు రూరల్, జూన్ 14: నందికొట్కూరు మండలంలోని శాతనకోట, జంగంపాడు గ్రామాల పరిధిలో ప్రకృతి వ్యవసాయ పొలాలను నంద్యాల ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బ్లూమ్ స్టడీ ప్రతినిధి, యూకేలోని హిడెన్ బర్గ్ యూనివర్సిటీ డాక్టర్ లిండ్సే జాక్ అతని బృందంతో కలిసి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతు మహేశ్వరరెడ్డితో మాట్లాడి ప్రకృతి వ్యవసాయం, వారు పాటిస్తున్న పద్ధతుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతు మధులత తన రెండు ఎకరాల పొలంలో 30 రకాల విత్తనాలతో పీఎంబీఎస్ పంట వేశారు. దీన్ని కూడా పరిశీలించారు. జంగం పాడు గ్రామంలోని నిరుపేద వ్యవసాయ కూలీలు వేసిన పెరటి తోటలను పరిశీలించారు. అలాగే గ్రామంలోని రైతులతో, మహిళా సంఘాల సభ్యులతో బ్లూమ్ స్టడీ ప్రతినిధి బృందం సమావేశం నిర్వహించి ముఖాముఖి చర్చలు జరిపారు. వారు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విషయాలను, గ్రామీణ జీవనశైలి విధానాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులు, చిన్న పిల్లల ఆహారం, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. బ్లూమ్ స్టడీ బృందం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'రక్తాన్ని ఇచ్చేది మనిషి మాత్రమే'

నంద్యాల కల్చరల్, జూన్ 14: సృష్టిలో అన్నింటినీ ప్రకృతి ఇస్తుందని, కానీ రక్తాన్ని మాత్రం మానవులే ఇస్తారని నంద్యాల ఆయుష్ యోగా సమితి నిర్వాహకుడు ఆనంద్‌గురూజీ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా కర్నూలు రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో కర్నూలు కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఐఏఎస్ చేతుల మీదుగా మెమెంటో, సన్మానం పత్రాన్ని ఆనంద్ గురూజీకి అందజేశారు. కండే హరినాథ్, చంద్రశేఖర్, లలిత్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

పాములపాడు, జూన్ 14: పాములపాడులోని మోడల్ స్కూల్‌లో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగ రవీంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 7,8,9, వ తరగతులకు సంబంధించి మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని, వారికి ఈ నెల 20న మోడల్‌స్కూల్ ఆవరణలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. అర్హత సాధించిన వారికి ప్రవేశం కల్పిస్తామని ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

జవ్వాజి సుంకన్న గౌడ్‌కు ఘన నివాళి

నందికొట్కూరు, జూన్ 14: నందిక్కోరు పట్టణంలో దానకర్ణుడుగా పేరు పొందిన జవ్వాజి సుంకన్న గౌడ్ 58వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ సుధాకరరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. శివభక్తులకు, దివ్యాంగులకు, వృద్ధులకు, పేదవారికి అన్నదాన కార్యక్రమాలు, ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలను ఆయన పేరుమీద నిర్వహిస్తున్న శ్రీకాంత్‌గౌడ్‌ను కమిషనర్ అభినందించారు.

కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నంద్యాల రూరల్, జూన్ 14: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అసోషియేషన్ సభ్యులు నంద్యాల తాలుకా జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన కార్యవర్గాన్ని ఎన్నికల పర్యవేక్షకుడు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నంద్యాల తాలుకా జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మహేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కిరణ్‌ప్రసాద్‌శర్మ, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా చాంద్‌బాషా, సహాయ కార్యదర్శిగా మదనగోపాల్, దుర్గేష్ ఎన్నికయ్యారు.

గో సంరక్షణ పథకానికి విరాళం

శ్రీశైలం, జూన్ 14: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి శుక్రవారం ఖమ్మంకు చెందిన మోతుకూరి వెంకటేశ్వర్లు రూ. 1,00,116 విరాళంగా అందజే శారు. దాత ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకులు నాగరాజు, హిమ బిందుకు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ

నంద్యాల క్రైం, జూన్ 14: పోలీస్ శాఖ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు, మెడికల్ గ్రౌండ్స్ ప్రమోషన్లు, రిక్వెస్ట్ బదిలీలపై ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. ఎస్పీ సీసీ నాగరాజు, ఆర్ఎస్ఐ శ్రీనాథరావు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు చంద్రబాబుకే సాధ్యం

● ఐదు సంతకాలతో ఆనందంలో పార్టీ శ్రేణులు ● ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయంపై హర్షం



బండిఆత్మకూరులో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు



ఆత్మకూరులో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు



శ్రీశైలంలో టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

బండిఆత్మకూరు, జూన్ 14: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయటం ఒక చంద్రబాబునాయుడుకే సాధ్యమని లబ్ధిదారులు అన్నారు. శుక్రవారం బండిఆత్మకూరు టీడీపీ కార్యాలయం ఎదుట టీడీపీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఐదు పథకాల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీతో నిరుద్యోగం తీరుతుందని, ల్యాండ్ టైటిలింగ్ జీవో రద్దు రైతుల గుండెల్లో నెలకొన్న ఆందోళన వైదొలగిందని, పింఛన్ పెంపు, రూ.4వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణతో పేదల ఆకలి తీరుతుందని, వృత్తి నైపుణ్యంతో ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వ్యక్తిగత లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు డాక్టర్ భరద్వాజశర్మ, మల్లేశ్వరరెడ్డి, కేసీ లింగారెడ్డి, మధురెడ్డి, జాకీర్, డిష్ రామలింగం, కృష్ణారెడ్డి, బాలుడు, ప్రసాద్, సిద్ధయ్య, పెద్దన్న, వెంకరామయ్య, నాగేశ్వరరెడ్డి, నందయ్య కొత్తూరయ్య కరీమ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: చంద్రబాబుతోనే రాష్ట్రంలోనే సుపరిపాలన సాధ్యమని మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్ అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు ఐదు హామీలపై సంతకాలు చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. ముందుగా గౌడ్‌సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే మిఠాయిలు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు. నాయకులు రిటైర్డు తహసీల్దార్ రామకృష్ణ, అబ్దుల్లాపురం బాషా, గౌస్‌ఆజాం, తిమోతి, యూనూస్, హరిప్రసాద్, గౌస్, సుబ్బయ్య, సుబ్బరావు, గంగాధర్‌రెడ్డి, రవీంద్రబాబు, కలీముల్లా, నాగూర్‌ఖాన్, అఫ్రఫఅలీ, మహబతుల్లా, యూసఫ్ ఉన్నారు.

మహానంది: మహానందిలోని మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తమ నేత ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీపై తొలిసంతకంతో పాటు ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, పింఛన్ పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెనెస్‌పై సంతకం చేసి మాట నిలబెట్టుకున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ యశస్వినిరెడ్డి, మండల కన్వీనర్ మధు, మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ పాణ్యం ప్రసాదరావు, క్రాంతికుమార్‌యాదవ్, మౌళీశ్వరరెడ్డి, మారెడ్డి సుబ్రమణ్యం, కిలార్ వెంకటేశ్వర్లు, గాజులపల్లి ఆర్ఎస్ శ్రీనివాసులు, సతీష్, దస్తగిరి పాల్గొన్నారు.

వెలుగోడు: చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి మొదటి ఐదు సంతకాలను పెట్టడం పట్ల నిరుద్యోగులు, రైతులు, పింఛన్‌దారులు, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, పలువురు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, అబ్దుల్ కలాం, మండ్ల శంకర్‌రెడ్డి, ఖలీలుల్లాఖాన్, జాకీర్‌హుసేన్ ఎల్లాల కృష్ణుడు, పాలశంకరరెడ్డి, అమిర్‌అలిఖాన్, మోమిన్ రసూల్, హుసేన్ బిం.ముర్తుజా, సూర్యనారాయణ, రామానాయుడు, జనసేన నాయకులు షాలుబాషా పాల్గొన్నారు.

గడివేముల: ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్ రూ.3 వేలు నుంచి రూ.4 వేలు పెంచడంతో శుక్రవారం మండల కేంద్రంలో పింఛన్ లబ్ధిదారులతో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను పెంచారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలం: శ్రీశైలంలోని స్వామి, అమ్మవార్ల ప్రధానాలయం ముందుభాగంలోని గంగాధర మండపం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్న తమ నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి స్వామి, అమ్మవార్ల అనుగ్రహం కలగాలని మండల టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి అన్నాడు. కూటమి నాయకులు రౌతు అశోక్ రమణ, బ్రహ్మయ్య, కృష్ణాచారి, జీవులానాయక్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



వెలుగోడులో మాట్లాడుతున్న నాయకులు



మహానందిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో సంబరాలు చేసుకుంటున్న నాయకులు



గడివేములలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రాజకీయాలకు అతీతంగా పని చేద్దాం: ఎమ్మెల్యే

కొత్తపల్లి, జూన్ 14: రాజకీయ పార్టీలకతీతంగా గ్రామాలభివృద్ధికి కృషి చేద్దామని నందికొట్కూరు టీడీపీ నూతన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన ఎంపీడీవో జవహర్‌బాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరయ్యారు. ఎమ్మెల్యేకు స్థానిక మండల నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛం ఇచ్చి, పూలు చల్లుతూ ఘనస్వాగతం పలికారు. ముందుగా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే జయసూర్య మండల మీట్‌లో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిలిచిన పనులపై శాఖల వారిగా ప్రణాళికలు సిద్ధం చేస్తే దశలవారిగా అభివృద్ధి చేస్తామని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రత్యేకించి కొత్తమాడుగుల వద్ద గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్‌డీపీ కింద మంజూరైన తాగునీటి పథకాన్ని 70 శాతం పూర్తి చేస్తే వైసీపీ ప్రభుత్వం మిగతా 30 శాతం కూడా పూర్తి చేయలేకపోయిందన్నారు. వీటిని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పరిశీలించి ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. అలాగే మండలంలో మరమ్మతులకు గురైన శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాలపై కూడా దృష్టి సారించి సాగునీరు అందిస్తామన్నారు. కొలనుభారతి పుణ్యక్షేత్ర అభివృద్ధికి కూడా పాటుపడుతామని తెలిపారు. గిరిజన గూడేల్లోని చెంచులకు నేటికి ఆదరణ లేకపోవడంవల్ల సంక్షేమ పథకాలు అందడం లేదని, వీటిపై ఐటీడీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వారికి ఆధార్ కార్డులు అందించాలని కోరారు. అలాగే ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. త్వరలోనే అన్ని శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి మండల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతామన్నారు. ఇక నుంచి మండల సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. అనంతరం జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అలాగే ఎమ్మెల్యే కొత్తపల్లిలోని మడ్డిపేటలో గుండెజబ్బుతో బాధపడుతున్న తెలుగు రామున్ని పరామర్శించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారిగా కొత్తపల్లికి రావడంతో మండలంలోని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ వెంకటరమణ, నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, నారపురెడ్డి, లింగస్వామి గౌడు, శ్రీనాథరెడ్డి, బుచ్చి రెడ్డి, మోహన్ యాదవ్, నాగేశ్వరరావు యాదవ్, స్వామిరెడ్డి, జడ్.వెంకటరెడ్డి, మహేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

సీఎం చంద్రబాబును కలిసిన మల్లెల రాజశేఖర్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 14: రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ శుక్రవారం సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పూలకుండీని సీఎం కు బహూకరించారు. రాష్ట్రంలో కూటమి అనూహ్య విజయంతో అధికారంలోకి రావడంపై సీఎం చంద్రబాబును మల్లెల అభినందించగా నంద్యాల జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లి నియోక వర్గాలను క్లీన్ స్వీప్ చేయడంపై మల్లెల రాజశేఖర్‌నును సీఎం అభినందించారు.



చంద్రబాబుకు పూల కుండీ అందజేస్తున్న మల్లెల రాజశేఖర్‌గౌడ్

'సరికొత్త వంగడాలు సృష్టించాలి'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ

మహానంది, జూన్ 14: భవిష్యత్తు వ్యవసాయ విద్యార్థులదే అని, రైతుల అభివృద్ధి కోసం సరికొత్త వంగడాలను సృష్టించి వ్యవసాయాన్ని ప్రోత్సాహించాల్సిన బాధ్యత మీ పైనే ఉందని నంద్యాల ఆర్ ఏ ఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ అన్నారు. శుక్రవారం రాత్రి మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల వార్షికోత్సవాన్ని కళాశాల అసోసియేటెడ్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సరలమ్మ చేత శాస్త్రవేత్తలు వేదికపై ఏర్పాటు చేసిన జ్యోతి ప్రజ్వలన చేయించారు. అనంతరం వ్యవసాయ ఏడీఆర్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. అనంతరం కళాశాల వార్షికోత్సవం పురష్కరించుకొని నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఏడీఆర్ డాక్టర్ సరలమ్మ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల ఓఏఎంలు ఎల్ విజయభాస్కర్, పరీదా, శాస్త్రవేత్తలు ఈఎస్వీ నారాయణరావు, శ్రీనివాసరెడ్డి, వెంకటేష్ బాబు పాల్గొన్నారు. కాగా శనివారం సాయంత్రం వ్యవసాయ కళాశాలలో హాస్టల్ డేను నిర్వహిస్తున్నట్లు డీన్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు.

'ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సత్ఫలితాలు'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 14: ప్రాథమిక దశలోనే గుర్తిస్తే క్యాన్సర్ చికిత్సకు సత్ఫలితాలు ఉంటాయని క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ మాధవ్ అన్నారు. శుక్రవారం నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ, కార్యదర్శి డాక్టర్ ఫణిల్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభించారు. క్యాన్సర్ నిపుణులు డాక్టర్ మాధవ్, కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు ఉదయ్ బ్లడ్ క్యాన్సర్ ఆధునిక చికిత్సలు, తుంటి కీళ్ళ మార్పిడి, శస్త్ర చికిత్స ఆధునిక విధానాలపై ప్రసంగించారు.

18న చెస్ జట్ల ఎంపికకు పోటీలు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 14: జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేది సంజీవ్ నగర్‌లోని సంకల్ప్ స్కూల్ ఆవరణలో 11 ఏళ్లలోపు బాల బాలికల జిల్లా చెస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ నెల 16లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 9010451585 నంబరులో సంప్రదించాలని కోరారు.

'రక్తదానం చేయాలి'

మహానంది, జూన్ 14: రక్తదానంలో యువత ముందుండాలని జనసేన నాయకుడు మల్లికార్జున అన్నారు. శుక్రవారం మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్‌లో ప్రపంచ రక్త దానదినాన్ని పురస్కరించు కొని జనసేన ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 30 మంది రక్తదానం చేసారన్నారు. వారికి ప్రశాంస పత్రాలు అందచేసారు. అనంతరం గ్రామంలోని పేద విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. జనసేన నాయకులు విజయ్, మారెడ్డి రామయ్య పాల్గొన్నారు.

దాడి చేసిన దంపతులపై కేసు నమోదు

పగిడ్యాల, జూన్ 14: మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన చెరుకు స్వాములుపై గొడ్డలితో దాడికి పాల్పడిన పాలమర్రి తిక్కస్వామిపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. స్వాములు అన్న కూతురు పద్మావతిని కొంత కాలంగా తిక్కస్వామి వేధింపులకు గురి చేయడంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇరువురికి సర్ది చెప్పి పంపివేశారు. అయినప్పటికి తిక్కస్వామి ఆమెను వేధింపులకు గురి చేస్తుండటంతో చిన్నాయన స్వాములుకు విషయాన్ని తెలిపారు. దీంతో గురువారం రాత్రి తిక్కస్వామి, భార్య సుజాత స్వాములుపై గొడలితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు స్వాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్య, భర్తలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

'నీట్ అవకతవకలపై విచారణ జరపాలి'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 14: నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 24 లక్షల మంది మెడికల్ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలి'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 14: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా సామగ్రి పేరుతో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలని ఏఐఎస్ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాగార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈవో, ఎంఈవోలకు ఈ మేరకు వినతి పత్రాలను అందజేశారు. నాగార్జున మాట్లాడుతూ జీవో నంబర్ 1 ను పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞ ప్తి చేశారు. కార్యక్రమంలో పవన్,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

'సూర్యనారాయణపై చర్యలు తీసుకోవాలి'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 14: ఏపీ వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై చర్యలు తీసుకుని సంఘాన్ని రద్దు చేయాలని ది సిటీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కమలాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాడని అభియోగంతో శాఖా పరమైన నివేదిక ఆధారంగా సూర్యనారాయణను సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును నానా దుర్భాషలాడి విమర్శించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయని గుర్తు చేశారు. నారాయణ ఒంటెద్దు పోకడలు నియంతృత్వ ధోరణితో అధికారులపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని అన్నారు.

పేద ఆర్యవైశ్యులకు గ్రైండర్లు పంపిణీ



పేద ఆర్యవైశ్యులకు గ్రైండర్లు పంపిణీ చేస్తున్న దాతలు

నంద్యాల కల్చరల్, జూన్ 14: నంద్యాల వాసవీ భవనంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, దాతల సహకారంతో పేద ఆర్యవైశ్యులకు గ్రైండర్లు, పిండి మిషన్లు శుక్రవారం పంపిణీ చేశారు. భవనాసి ట్రస్ట్ నిర్వహకులు, జిల్లా ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, నంద్యాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భవనాశి వాసు, దియ్యాల మధుసూదన రావు, సెవెన్ హిల్స్ హాస్పటల్స్ అధినేత రెంటాల మారుతికుమార్, తదితరుల దాతల సహకారంతో పేద ఆర్యవైశ్యుల జీవనాదారం కోసం 2లక్షల రూపాయల విలువచేసే 5 గ్రైండర్లు , పిండిమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేలంలో రూ.47 లక్షల ఆదాయం

మహానంది, జూన్ 14: మహానంది దేవస్థానంలో భక్తులు సమర్పించే కొబ్బరికాయలు పోగు చేసుకొనే హక్కుతో పాటు నవగ్రహ మంటపం వద్ద భక్తుల చేత దీపాలు వెలిగించే హక్కుకు శుక్రవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో టెండర్ దారుల సమక్షంలో బహిరంగ వేలాలు నిర్వహించారు. దేవస్థానానికి రూ.47 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇందులో సీల్ టెండర్ల ద్వారా దేవస్థానానికి అనుకున్నంత ఆదాయం రాక పోవడంతో టెండర్ దారుల సమక్షంలో తిరిగి బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో వచ్చే ఏడాది మార్చి 31 వతేది వరకు భక్తులు సమర్పించే ఒక కొబ్బరి చిప్పను పోగు చేసుకొనే హక్కును మహానందికి చెందిన ధనుంజయశర్మ రూ.14 లక్షలకు హెచ్చుపాట పాడి దక్కించుకొన్నారు. అలాగే నవగ్రహ మంటపం వద్ద భక్తుల చేత రూ.5 ప్రకారం వసూలు చేసి దీపాలు వెలిగించే హక్కును మహానంది కి చెందిన టి.వి. ఉమామహేశ్వయ్య రూ.33 లక్షలకు వచ్చే ఏడాది మార్చి 31 వతేది వరకు కాలపరిమితి కింద బహిరంగ వేలంలో హెచ్చు పాటపాడి దక్కించుకొన్నట్లు ఈవో చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, సిబ్బంది నాగమల్లయ్య, టెండర్‌దారులు పాల్గొన్నారు.

'చెరువుకు మరమ్మతులు చేపట్టాలి'

పాణ్యం, జూన్ 14: మండలంలోని భూపనపాడు గ్రామ చెరువు మరమ్మతులు చేపట్టాలని గ్రామ రైతులు మైనర్ ఇరిగేషన్ అధికారులను కోరారు. శుక్రవారం రైతులు డీఈ భాస్కర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, సీఐటీయూ నాయకులు భాస్కర్, టీడీపీ నాయకులు సునీల్, రైతులు గోవిందు, జనార్దన్, జయరాముడు, వెంకటసుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, బాలేశ్వర్‌రెడ్డి, వీరనారాయణ పాల్గొన్నారు.

'బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి'



శిరివెళ్ల: మాట్లాడుతున్న సీఐ చంద్రబాబు

శిరివెళ్ల, జూన్ 14: మండలంలోని ప్రజలు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని శిరివెళ్ల సర్కిల్ సీఐ చంద్రబాబు కోరారు. ఈ నెల 17న బక్రీద్ పర్వదినం సందర్భంగా మండలంలోని హిందూ, ముస్లింలతో శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం శాంతి సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గోవధ, గోవుల అక్రమ రవాణా నిషేధమన్నారు. ప్రజలు రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా పండుగలను నిర్వహించుకుని సోదరభావంతో మెలగాలన్నారు. గ్రామాల్లో అలజడులు సృష్టించినా.. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్ మండల ప్రజలు పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాల్లో బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రమణయ్య సూచించారు. శుక్రవారం సాయంత్రం చాగలమర్రి పోలీసు స్టేషన్ ఆవరణలో ఈనెల 17న బక్రీద్ పండుగను పురష్కరించుకొని శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ హిందూ, ముస్లింలు ఐకమత్యంతో మెలగాలని అన్నారు. ప్రభుత్వ ఖాజీ యూనస్, గ్రామ పెద్దలు అన్సర్‌బాషా, గుత్తి నరసింహులు, షబ్బీర్, లక్ష్మణబాబు, మల్లికార్జున, కొలిమి షరీఫ్ బషీర్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల పురోగతికి కృషి చేయాలి



చల్లా విజయ భాస్కర్‌రెడ్డిని అభినందిస్తున్న వెలుగు అధికారులు

అవుకు, జూన్ 14: పొదుపు సంఘాల పురోగతికి వెలుగు అధికారులు కృషిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వెలుగు ఏపీఎం విజయ గోపాల్, పొదుపు సంఘం సీసీలు, సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డిని కలుసుకొని పూలమాలలు వేసి అభినందించారు. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం పొదుపు మహిళలకు అండగా నిలుస్తుందన్నారు. పొదుపు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీసీలు రవికుమార్, మద్దిలేటి, భీమేశ్, జయమ్మ, అకౌంటెంట్ ఓబులేసు, వీవోఏలు పాల్గొన్నారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినిలతో ఉపాధ్యాయులు

బనగానపల్లె, జూన్ 14: బనగానపల్లె జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న 11 మంది బాలికలు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎన్నికైనట్లు హెచ్ఎం గంగాధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వీరికి ఉన్నత చదువుల కోసం సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ.12వేలు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తుందన్నారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన బాలికలను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

బనగానపల్లె రూరల్, జూన్ 14: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి వైఎస్ఆర్ జిల్లా కడప వాసులు రూ.లక్ష విరాళం అందించారు. శుక్రవారం కడపకు చెందిన చౌడం సదా రమణ, కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం రూ.75వేలు, నిత్యాన్నదాన సత్రానికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.లక్ష నగదును అర్చకులకు అందజేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాబివృద్ధి

కోవెలకుంట్ల, జూన్ 14: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్టారెడ్డి, కోవెలకుంట్ల మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం వారు కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల్లో చెప్పిన విధంగానే ముఖ్యమంత్రి పదవి చేపట్టిన మెగా డీఎస్సీ, ఏపీ ల్యాండ్ టైటిల్‌యాక్టు రద్దు, సామాజిక పింఛన్లు రూ.4వేలకు పెంచడం, అన్న క్యాంటీన్లు పునరుద్ధరణ, స్కిల్ సెన్సెస్ వంటి పథకాలపై అమలుకు సంతకం చేసి మాట నిలుపుకున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు గడ్డం అమర్ నాథరెడ్డి పాల్గొన్నారు.

గోవధ నిషేధం

డోన్(రూరల్), జూన్ 14: బక్రీద్ పండుగను పురస్కరించుకుని గోవధ నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ గోవులను వాటి దూడలను వధించినా, అక్రమంగా కబేళాలకు తరలించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

'ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు'

రుద్రవరం, జూన్ 14: ఏపీలో చంద్రబాబునాయుడు ఎన్నికలకంటే ముందు వాగ్దానం చేసిన మాటలన్నింటినీ నిలబెట్టుకున్నారని టీడీపీ నాయకుడు గురప్ప శుక్రవారం అన్నారు. సీఎం అయిన వెంటనే మెగా డీఎస్సీపై తొలిసంతకం చేసి టీచరు పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకున్నారన్నారు. పించను పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేందుకు ల్యాండ్ టైటిలింగుఖ యాక్టు రద్దు చేయడంతో ప్రజలు సంతోషపడుతున్నారాన్నరు.

చాగలమర్రిలో కుండపోత వర్షం

చాగలమర్రి, జూన్ 14: చాగలమర్రి గ్రామంలో శుక్రవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయ ప్రాంగణాలు జలమయమయ్యాయి. పశువైద్య కేంద్రం రహదారిలో వర్షపు నీరు జలమయమైంది. ప్రభుత్వ వైద్యశాల సమీపంలో రహదారిపై వర్షపు నీటితో కలిసి మురుగు రహదారిపై ప్రవహించింది. వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. గత నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలు వ్యవసాయ పనులు చేసేందుకు సంసిద్ధమయ్యారు.

'పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి'

రుద్రవరం, జూన్ 14: పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఇన్‌చార్జి ఎంఈవో కోటయ్య అన్నారు. శుక్రవారం రుద్రవరం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంఈవో మాట్లాడుతూ మండలంలో 56 పాఠశాలలు ఉన్నాయని, మొత్తం విద్యార్థులు 4791 మంది ఉన్నారని చెప్పారు. నోటు బుక్కులు 26190, టెక్ట్స్‌బుక్స్ 33742 మంజూరయ్యాయన్నారు. విద్యార్థుల్లో బాలురు 2327, బాలికలు 1167 మందికి బెల్టులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లక్ష్మి తదితరులు ఉన్నారు.

మంత్రి బీసీకి అభినందనల వెల్లువ





మంత్రి బీసీ దంపతులను కలిసిన టీడీపీ నాయకులు, బీసీకి అభినందనలు తెలుపుతున్న కొలిమిగుండ్ల టీడీపీ నాయకులు

అవుకు, జూన్ 14: ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం ఉదయం అవుకు మండలానికి చెందిన టీడీపీ నాయకులు అమరావతికి వెళ్లి అభినందనలు తెలిపారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రమణనాయక్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణానాయక్, అవుకు మండల క్లస్టర్ ఇన్‌చార్జి అరుణ్‌నాయక్, జిల్లా టీడీపీ యువత అధికార ప్రతినిధి వెంకటరాముడు నాయక్, తెలుగుకిట్టు, సంగపట్నం ఐసర్ బాషా, బత్తిన మద్దిలేటిగౌడ్, దంతెల రమణ బీసీని కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

కోవెలకుంట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులను కోవెలకుంట్ల మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు పూల సుబ్బారెడ్డితోపాటు పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ కోవెలకుంట్ల ప్రాంతం నుంచి సుమారు 50 సంవత్సరాల క్రితం మంత్రిగా సుబ్బారెడ్డి ప్రాతినిధ్యం వహించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ మంత్రి పదవి ఎవరినీ వరించలేకపోయింది. ఇటీవల టీడీపీ ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డి బనగానపల్లె నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలిచి రాష్ట్రమంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, మైనార్టీ నాయకులు కుళాయిబాషా, పాతపెట్రోలు బంకు అధినేత సునీల్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల రూరల్: రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డిని కొలిమిగుండ్ల మండల టీడీపీ నాయకులు అభినందించారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవాడకు తరలివెళ్లి మంత్రి బీసీ దంపతులకు అభినందనలు తెలిపారు. కొలిమిగుండ్లకు చెందిన గూలి నాగేశ్వరరెడ్డి, గూడూరు నాగేశ్వరరెడ్డి, భూపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి, దస్తగిరి, బ్రంద, కోరుమానుపల్లెకు చెందిన నరసింహారెడ్డి, ఓబయ్య, భూపాల్‌రెడ్డి, తిమ్మనాయినిపేటకు చెందిన గోపాల్, గిరి, బాలుశెట్టి, మద్దిలేటి, బెలుం పోతిరెడ్డి రాఘవరెడ్డి, నందిపాడుకు చెందిన లోక్‌నాథరెడ్డితో పాటు పలువురు నాయకులు మంత్రి బీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బనగానపల్లె రూరల్: సీఎం చంద్రబాబునాయుడు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సేవలను గుర్తించి ఆర్అండ్‌బీ శాఖ కేటాయించడంపై టీడీపీ వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం బనగానపల్లె పట్టణంలోని టంగుటూరి శీనయ్య కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీసీ కుటుంబ అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు, టంగుటూరి శీనయ్య మాట్లాడుతూ బీసీ జనార్దన్ రెడ్డి గత ఐదేళ్లుగా కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండి టీడీపీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నాగేంద్రారెడ్డి, బత్తుల భాస్కర్‌రెడ్డి, ఆర్‌సీ నాగిరెడ్డి, అబ్దుల్ ఖాదర్, టీచర్ నాగరాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కాసుల జంగంశెట్టి, బచ్చు భాస్కర్, ప్రసాద్, హోటల్ ఎల్లయ్య, దూదెకుల దస్తగిరి, తిరుమలయ్య పాల్గొన్నారు.,

సంజామల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రిగా మంత్రి వర్గంలో స్థానం దక్కించుకున్న బీసీ జనార్దన్ రెడ్డిని సంజామల టీడీపీ నాయకులు పేండేకంటి కిరణ్ కుమార్ ఓత్రమానదిన్నె చంద్రశేఖర్ రెడ్డి , వసంతాపురం నాగరాజు శుక్రవారం విజయవాడలో కలిసి అభినందనలు తెలిపారు. 2011 నుంచి టీడీపీలో పనిచేస్తూ బీసీ వర్గంలో కొనసాగడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.


● సంజామల మండలం పేరుసోముల గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయ కులు సంబరాలు జరుపుకున్నారు. బనగానపల్లె ఎమ్మెల్యే బీసీజనార్దన్ రెడ్డి చంద్రబాబు కేబినేట్‌లో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా స్థానం కల్పించడంతో టీడీపీ సీనియర్ నాయకులు బెలుం సురేష్ రెడ్డి, శంకర్ రెడ్డి , శీలం వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.



మంత్రి బీసీని అభినందిస్తున్న టీడీపీ నాయకులు



మంత్రి బీసీని కలిసిన తిమ్మనాయినిపేట టీడీపీ నాయకులు



బీసీ జనార్దన్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ నాయకులు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

సాగు, తాగునీటికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూన్ 14: డోన్ నియోజకవర్గంలో రైతులకు సాగు, ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే కోట్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులతో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. రైతులకు సాగునీరు అందించేందుకు చెరువులకు నీళ్ల నింపే ప్రాజెక్టుకు పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువులకు నీళ్ల నింపి రైతులను ఆదుకోవడమే తన లక్ష్యమని కోట్ల అన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే కోట్ల ఆదేశించారు. డోన్ నియోజకవర్గంలో వాటర్ ప్రాజెక్టు పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వాటర్ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తానని ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని అందించేలా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అదేవిధంగా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మండల పరిషత్, విద్యుత్, వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మీ శాఖల పరిధిలో ఏ ఏ అభివృద్ధి పనులు జరుగుతున్నదీ వివరాలతో తదుపరి సమావేశానికి హాజరు కావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర గొర్రెల పెంపకందారుల పెడరేషన్ ఛైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్, డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కోట్రికే హరికిషణ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వలసల రామక్రిష్ణ, కోట్రికే ఫణిరాజ్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి విజయభట్లు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, విజయకుమార్ రెడ్డి, తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ డా. జయరాం, పీఆర్ ఏఈ నారాయణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో రివ్యూ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల

● **ఎమ్మెల్యే కోట్లకు అభినందనల వెల్లువ:** పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మొదటిసారి సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే కోట్లకు అభినందనలు వెల్లువెత్తాయి. వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యే కోట్లకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువలతో సన్మానించారు. ఐసీడీఎస్ సీడీపీవోతో పాటు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఎమ్మెల్యే కోట్లకు అభినందనలు తెలిపారు.

దాడిలో గాయపడిన వృద్ధురాలి మృతి

రుద్రవరం, జూన్ 14: మండలంలోని యల్లావత్తుల గ్రామానికి చెందిన జంగం ప్రకాశమ్మ (60) ఈ నెల 10వ తేదీ వీధిలోని వారి దాడికి గురై శుక్రవారం మృతి చెందింది. ఈ నెల 10న వృద్ధురాలిని వీధిలోని వారు అసభ్యకరంగా తిడుతుండగా ఆమె ప్రశ్నించింది. దీంతో వారు టెంకాయ మట్టతో దాడి చేశారు. గాయపడిన ఆమె స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ డాక్టరు వద్ద వైద్యం చేయించుకుంది. ఆ తర్వాత గుండెల్లో నొప్పి ఉంటూ శుక్రవారం మృతి చెందిందని భర్త నరసింహరావు అన్నాడు. ఈ మేరకు ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

కోవెలకుంట్ల, జూన్ 14: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వాసవీ బొమిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ బొమిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినం ఘనంగా నిర్వహించారు. రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు ఈవీ భాస్కర్‌రెడ్డి, క్రిష్ణదాస్, శశాంక్‌రెడ్డి, రాజు, రాజశేఖ ర్, లక్ష్మీదేవి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

బేతంచెర్ల: ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకర్ రెడ్డి, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల అమర్నాథ్ రెడ్డి, సలీంమాలిక్ చేతుల మీదుగా బేతంచెర్ల లైఫ్ యువనేత్ర సేవా సమితి సభ్యులు బ్లడ్ డోనర్ రవికు మార్ షేక్షావలి, విజయేంద్రారెడ్డి, అబ్దుల్లా, జాకీర్, మణికంఠ, పవన్ కుమార్, యాసీన్‌బాషాలను సన్మానించారు.

మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా ఎంపిక

చాగలమర్రి, జూన్ 14: మండలంలోని కేపీ తండా అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లాలోనే మోడల్ కేంద్రంగా ఎంపికైనట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. మూడేళ్ల పైబడిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చుకోవడం, ఐదేళ్ల పైబడిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పిస్తామన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్రంలో తిరుచ్చి సేవ

బేతంచెర్ల, జూన్ 14 : మండలంలో ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో ఉన్న మద్దిలేటి స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి తిరుచ్చి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామి, అమ్మవార్లకు ఆలయ వేద పండితులు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి రామాంజనేయులు, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ సీతారామచంద్రుడు, ధర్మకర్తలు భక్తులు పాల్గొన్నారు.

'పశువుల వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి'

చాగలమర్రి, జూన్ 14: గ్రామాల్లో పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాదు సూచించారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలో గొర్రెలకు పశు వైద్య సిబ్బంది వేస్తున్న టీకాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ, చాగలమర్రి గ్రామాల్లో పశువులకు గొంతువాపు, గొర్రెలు, మేకలకు చిటిక వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామని తెలిపారు. రైతులు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, వీహెచ్ఏలు ఉన్నారు.



సొంత జిల్లా పర్యటనకు ముందుగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అమరావతిలో సహచర మంత్రులతో కలసి సీఎం చంద్రబాబు నాయుడును కలిశారు. - బనగానపల్లె

'చంద్రబాబుతోనే అభివృద్ధి'

రుద్రవరం, జూన్ 14 : రాష్ట్రంలో చంద్రబాబుతో ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మందలూరు సచివాలయంలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఫొటోలను ఏర్పాటు చేశారు. మందలూరులో టీడీపీ జెండా ఎగురవేసి సంబరాలు జరుపుకొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు తొలిసంతకం చేశారన్నారు. కార్యక్రమంలో రాజశేఖరరెడ్డి జనార్దనరెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

రుద్రవరం, జూన్ 14: రుద్రవరం ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 20న ఉదయం 10గంటలకు పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈనెల 18వతేదీ లోపు విద్యార్థి ఆధార్‌కార్డు, ఫొటో తీసుకుని పాఠశాలలో అందజేయాలన్నారు.

ఇతిహాసాలను తెలుసుకోవాలి

బేతంచెర్ల, జూన్ 14 : భారతీయుడిగా జన్మించిన ప్రతి వ్యక్తి మన ఇతిహాసాలను తెలుసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డా. మల్లు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ముసలాయ చెరువు గ్రామంలోని రామాలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన ధార్మిక ప్రవచనాలు వినిపించారు.

చే గువేరా యువతకు ఆదర్శం

బేతంచెర్ల, జూన్ 14 : యువతకు చే గువేరా ఆదర్శమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, మండల కార్యదర్శి ప్రదీప్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చే గువేరా 91వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు మనోహర్, హరి, వెంకటాచారి, సాయి, చరణ్, రాంబాబు, వినయ్ పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దుపై న్యాయవాదుల హర్షం

నంద్యాల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందిగా మారిన భూ హక్కు చట్టం రద్దు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాన్ని ఆళ్లగడ్డ న్యాయవాదులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారంతా కోర్టు ఆవరణలో సమావేశమై భూ హక్కు చట్టం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను తెలిపారు.

బంగారు ఆభరణాలు స్వాధీనం

- విలువ సుమారు రూ.18.20 లక్షలు
- రూ.50 వేలు నగదు కూడా..
- కారు డ్రైవరు అరెస్టు

నంద్యాల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): దొర్నిపాడు మండలం డబ్ల్యూకొత్తపల్లె గ్రామానికి చెందిన కారు డ్రైవరు యోగీశ్వరరెడ్డిని అరెస్టు చేసి రూ. 18.20 లక్షలు విలువ చేసే ఆభరణాలతో పాటు రూ.50 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ షర్ఫుద్దీన్ శుక్రవారం తెలిపారు. ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కారు డ్రైవర్ యోగీశ్వరరెడ్డి ఈనెల 4, 8 తేదీలలో బంగారు ఆభరణాలు దొంగలించాడని సందీప్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కారు డ్రైవరుగా పని చేస్తున్న వ్యక్తే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని విచారణలో తేలింది. యోగీశ్వరరెడ్డి 5.8 గ్రాముల బంగారు డైమండ్ నెక్లెస్, 11 గ్రాముల బంగారు నెక్లెస్, 35 గ్రాముల మరో నెక్లెస్, 49 గ్రాములున్న నాలుగు బంగారు గాజులు, 14 గ్రాములున్న బంగారు డాలరును, రూ. 50 వేలు నగదు దొంగలించారని చెప్పారు. దొర్నిపాడు హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్, దొర్నిపాడు ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించి యోగీశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. నిందితున్ని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించారని చెప్పారు.

'మలేరియాతో అప్రమత్తంగా ఉండాలి'



మద్దూరులో ర్యాలీ చేస్తున్న ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు

చాగలమర్రి, జూన్ 14: సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, మెదడువాపుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మద్దూరు, పెద్దవంగలి గ్రామాల్లో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా జాగ్రత్తగా ఉండాలని, ఇళ్ల ముందు మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది భూదేవి, రజిని, పద్మావతి, శేఖర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కౌలు వేలంలో తగ్గిన ఆదాయం

ఉయ్యాలవాడ, జూన్ 14: మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో నిర్వహించిన ఆలయ భూముల కౌలు వేలం రూ. 50 వేలు తగ్గిందని బనగానపల్లె డివిజన్ దేవదాయ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం తుడుమలదిన్నె గ్రామంలో ఆలయ భూముల కౌలు వేలం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 42.27 ఎకరాల దేవదాయ భూమిని కౌలుకు వేలం వేయగా రూ. 2.56 లక్షలు వచ్చిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ. 50 వేలు కౌలు తగ్గిందన్నారు. ఈవో చంద్రుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'జీవో నెంబరు 117ను రద్దు చేయాలి'

ఉయ్యాలవాడ, జూన్ 14: గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబరు 117ను రద్దు చేసి ఒకటి నుంచి ఐదు తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే నిర్వహించాలని ఆర్జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ కోరారు. శుక్రవారం మాయలూరు గ్రామ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంతో పాటు తెలుగు మీడియంను కూడా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయుకు యాప్‌ల భారాన్ని కూడా తగ్గించాలన్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

'సేవాగుణం అలవర్చుకోవాలి'

శిరివెళ్ల, జూన్ 14: సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవరచుకోవాలని నంద్యాల ఆయుష్ యోగా సేవా సమితి నిర్వాహకులు ఖండె ఆనంద్ గురూజీ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా కర్నూలు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూలు పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ సృజన చేతుల మీదుగా ఆనంద్ గురూజీ ప్రశంసాపత్రం, మెమెంటో అందుకున్నారు. ప్రజలు తమవంతు బాధ్యతగా సామాజిక, సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఖండె హరినాథ్, చంద్రశేఖర్, లలిత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి'

శిరివెళ్ల, జూన్ 14: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఎంఈవోలు శంకర్ ప్రసాద్, నాగార్జునరెడ్డి తెలిపారు. శిరివెళ్లలో శుక్రవారం వారు మాట్లాడుతూ మండలంలోని 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు 30,774 నోట్ పుస్తకాలు మంజూరైనట్లు తెలిపారు. 1వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు 35,600 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. ఇంకా 19 వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందని వెల్లడించారు. మండలంలోని విద్యార్థులకు 3,620 బెల్టులు వచ్చాయన్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన బ్యాగులు, యూనిఫామ్, షూస్ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని ఎంఈవోలు తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలల హెచ్ఎంల ద్వారా విద్యార్థులకు అందజేసినట్లు వారు తెలిపారు.

ల్యాండ్ టైటిల్ చట్టం రద్దుపై న్యాయవాదుల హర్షం

డోన్(రూరల్), జూన్ 14: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేయడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు డోన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కృష్ణప్రసాద్, కోశాధికారి మంగమూరి శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ నాగరాజు, సీనియర్ న్యాయ వాదులు రామలింగయ్య, మహేశ్వరరెడ్డి, మధుసూదన్‌గౌడు, కాశీం సాహెబ్, ఈశ్వరయ్య, పులిదామోదర్, మద్దయ్య పాల్గొన్నారు.


డోన్‌లో హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

బనగానపల్లె: ల్యాండ్ టైటిల్ చట్టాన్ని సీఎం చంద్రబాబు రద్దు చేయడంపై బనగాన పల్లె న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం రైతులను మోసం చేసి వారి భూమిపై హక్కులేకుండా కుట్ర పూరితంగా అమలు చేయాలనుకున్న ల్యాండ్ టైటిల్ చట్టాన్ని టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబు ఈచట్టాన్ని రద్దు చేయడం హర్షనీయ మని బనగానపల్లె జూనియర్ సీవిల్ న్యాయాధికారి, న్యాయవాదులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు వెలుపన టీడీపీ ప్రభుత్వం తీసుకున్న రద్దు నిర్ణయంపై బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జడ్. కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, జగన్నాథరెడ్డి ఆధ్వ ర్యంలో పలువురు న్యాయవా దులు సీఎం చంద్రబాబు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి అభినం దనలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశం, శ్రీనివాసమూర్తి, ప్రకా శ్‌రెడ్డి, రఘురామిరెడ్డి, వెంకట రాముడు, రాజశేఖర్, లాయర్ బాబు, నాగేంద్రరెడ్డి, తప్పెట శ్రీను, జునైద్‌బాషా, ముజఫర్ హుసేన్, విక్రమ్, హరి కృష్ణారెడ్డి, భాస్కర్, కమల్‌తేజారెడ్డి, శివరాం, సుదర్శన్ పాల్గొన్నారు.

















